క్లుప్తంగా

వారసంతకు వేలం



వేలంలో పాల్గొన్న గ్రామస్తులు

తానూరు: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం అధి కారుల సమక్షంలో వారసంతకు వేలం నిర్వహించారు. ఆగస్టు 2024 నుంచి మార్చి 2025 వరకు నిర్వహించిన వేలంపాటలో అదే గ్రామానికి చెందిన సాబీర్‌ఖాన్ పాల్గొని రూ. 1.92 లక్షలకు వారసంత నిర్వహణను దక్కించుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి జలంసింగ్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు విఠల్, మాధవ్‌రావ్, రాములు, నాయకులు పుండలిక్ గ్రామస్తులు పాల్గొన్నారు.

'సాగునీరు విడుదల చేయండి'



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

లోకేశ్వరం: మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామంలోని భీంచెరువు నుంచి సాగునీటిని విడుదల చేయాలని ఆయకట్టు రైతులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మోతీరాంను కలసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. చెరువు కింద నారు పోశామని.. నీటిని విడుదల చేస్తే పొలాలు దున్ని నాటు వేస్తామని అన్నారు. ఇరిగేషన్ ఏఈ శ్రీకాంత్‌కు విషయం తెలిపి సాగునీరు విడుదల చేసేలా చూస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు.

ఆశావర్కర్ల అరెస్టు



ఆశావర్కర్లతో ఎస్సై సుమలత

లక్ష్మణచాంద: హైదరాబాద్‌లోని వైద్యారోగ్య శాఖ కార్యాలయం ఎదుట మంగళవారం చేసే ధర్నాకు వెళ్లేందుకు సిద్ధమైన మండలంలోని ఆశావర్కర్లను సోమవారం అర్ధరాత్రి పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. తమ డిమాండ్ల సాధనకు ధర్నా చేసేందుకు వెళ్తే పోలీసులు అడ్డుకోవడం సరికాదని ఆయా గ్రామాల ఆశావర్కర్లు పేర్కొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

ముధోల్: మండల కేంద్రంలో మంగళవారం రోడ్డు భద్రత నిబంధనలపై పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనదారులు డ్రైవింగ్‌లైసెన్స్, బీమా, ఆర్‌సీ వంటి ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. గుట్కా, గంజాయి విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెడ్‌కానిస్టేబుళ్లు సాహెబ్‌రావు, అర్జున్, దిగంబర్ ఉన్నారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలో..

లక్ష్మణచాంద: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ఆర్టీసీ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ రాజన్న పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కనకాపూర్‌లో ప్రధాన కూడలి వద్ద గ్రామస్తులకు రోడ్డు భద్రత నియమాలపై నిర్మల్ ఆర్టీసీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ అధికారులు కే.వి.సాగర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి ఉదారత

కడెం: మండలంలోని లింగాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఏడు, ఎనిమిదో తరగతి చదువుతున్న పది మంది నిరుపేద విద్యార్థులకు ఉపాధ్యాయుడు స్టడీ మెటీరియల్ అందించి ఉదారత చాటాడు. అదే పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు వాల్గోట్ కిషన్ రూ.9వేల విలువైన స్టడీ మెటీరియల్ అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం బచ్చు వెంకటరమణ, ఉపాధ్యాయులు భూమేశ్వర్, బాలాజీ, నర్సయ్య, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

'పెండింగ్ బిల్లులు అందించాలి'

భైంసాటౌన్: పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సంబంధించి స్థిరీకరణ బకాయిలు, ఇతర పెండింగ్ బిల్లులను సకాలంలో అందించాలని తపస్ నాయకులు కోరారు. మంగళవారం పట్టణంలోని ఎస్టీవో కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులు పదోన్నతి పొందిన నేపథ్యంలో సంబంధిత బిల్లులను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షులు టి. నవీన్‌కుమార్, సీనియర్ సంఘ బాధ్యుల రామ్‌నరేష్, అనంత్ కిశోర్ ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

భైంసాటౌన్: రెండో విడత రుణమాఫీ సందర్భంగా పట్టణంలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. రైతుల తరఫున సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. శంకర్‌చంద్రే, రాంచందర్, మైనార్టీ నాయకులు ఉన్నారు.

కలగానే మధ్యాహ్న భోజనం

- అర్ధాకలితో జూనియర్ కళాశాలల విద్యార్థులు
- ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులు



ముధోల్‌లో ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం తింటున్న విద్యార్థులు



ముధోల్ జూనియర్ కళాశాల

ముధోల్: మారుమూల గ్రామాల నుంచి పేదవిద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో, సైకిళ్లపై ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు వచ్చి చదువుకుంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జూనియర్ కళాశాలల్లో తరగతులు నిర్వహిస్తుండటంతో వారు అర్ధాకలితో అలమటిస్తున్నారు. పొద్దున ఏదో ఒకటి తిని కళాశాలకు బయలుదేరుతారు.. కొందరి ఇళ్లల్లో వంటలు కూడా కావు. దీంతో విద్యార్థులు పూర్తిస్థాయిలో చదువుపై దృష్టి సారించడం లేదు. గత ప్రభుత్వం పాఠశాలలతోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు సైతం మధ్యాహ్న భోజనం అందిస్తామని చెప్పడంతో మారుమూల గ్రామాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా ముందుకొచ్చి ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు తీసుకొని విద్యను అభ్యసిస్తున్నారు.

జిల్లాలో 13 కళాశాలలు..

జిల్లాలో 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలుండగా.. వాటిల్లో 4,380 మంది చదువుతున్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 2,230, ద్వితీయ సంవత్సరం వారు 2,150 మంది ఉన్నారు.

ముధోల్ కళాశాలలో 550 మంది విద్యార్థులు..

మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూమీడియం, వొకేషనల్ కోర్సుల్లో 550 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. రోజు తమ ఇంటి వద్ద నుంచి టిఫిన్ బాక్సులతోపాటు వాటర్‌బాటిళ్లు తెచ్చుకుంటారు. కొందరి ఇళ్లల్లో వంటలు కాకపోవడంతో విద్యార్థులు మధ్యాహ్న భోజనం తెచ్చుకోవడం లేదు. కొందరు బయట ఏదో తిని కడుపు నింపుకుంటున్నారు. మరికొందరు మధ్యాహ్నమే ఇళ్లకు వెళ్తున్నారు.

ప్రవేశాలు పెరుగుతాయి.

ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తే విద్యార్థుల ఆకలి తీరి చదువుపై దృష్టి సారిస్తారు. హాజరుతోపాటు ప్రవేశాలు కూడా పెరుగుతాయని పలువురు పేర్కొంటున్నారు.

మధ్యాహ్న భోజనం అందించాలి



ఉన్నత విద్యాశాఖ అధికారులు జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తే మాలాంటి విద్యార్థులకు మేలు జరుగుతుంది. దీంతో కళాశాలకు వచ్చేవారి సంఖ్య కూడా పెరుగుతుంది. – అర్చన, విద్యార్థిని, సరస్వతీనగర్

ఒక్కోసారి ఇంట్లో వంట కాదు..



నేను 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న బోరిగాం నుంచి ముధోల్ కళాశాలకు వస్తుంటా. మా ఊరి నుంచి బస్సు కళాశాల టైం కన్నా ముందే వస్తుంది. దీంతో ఒక్కోసారి ఇంట్లో వంట కాకపోవడంతో టిఫిన్ బాక్సు తెచ్చుకోవడం లేదు. అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో మాదిరి జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అందించాలి. – మహేశ్, విద్యార్థి, బోరిగాం

అనుమతులు రాగానే ఏర్పాటు చేస్తాం

విద్యాశాఖ అధికారుల నుంచి అనుమతులు రాగానే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తాం. జూనియర్ కళాశాలకు మారుమూల గ్రామాల నుంచి విద్యార్థులు ఎక్కువగా వస్తుంటారు. ఆదేశాలు వస్తే విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చూస్తాం. – కైసర్‌పాషా, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, ముధోల్

'ఉపాధి' సిబ్బందిపై డీఆర్డీవో ఆగ్రహం

- కూలీల నుంచి రూ.77,124 రికవరీకి ఆదేశం



కూలీల వాదనాలు వింటున్న డీఆర్డీవో విజయలక్ష్మి

లోకేశ్వరం: గ్రామాల్లో ఉపాధి హామీ పనుల విషయంలో సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించడం లేదని డీఆర్డీవో విజయలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో 14వ విడత ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక మంగళవారం నిర్వహించారు. ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు మండలంలో చేసిన పనులను 12 రోజులు ప్రతి గ్రామంలో తనిఖీ చేశారు. కొన్ని గ్రామపంచాయతీల్లో కూలీలు పనులకు రాకున్నా మాస్టర్ రోల్‌లో సంతకాలు చేయించి డబ్బులు చెల్లించారనే ఆరోపణలు వచ్చాయి. ఏడాదిలో పనుల కోసం రూ.76,10,70,126 ఖర్చు చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా డీఆర్డీవో విజయలక్ష్మి మాట్లాడుతూ ఉపాధిహామీ పనులు సక్రమంగా నిర్వహించాలన్నారు. పనుల సమయంలో ఉపాధిహామీ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు పని ప్రదేశానికి వెళ్లాలని సూచించారు. ఉపాధిహామీ సిబ్బంది అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వివిధ గ్రామాల్లో ఉపాధిహామీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల రికార్డులు పీఆర్ శాఖవారు సామాజిక తనిఖీ బృందాలకు చూపలేదని తెలిపారు. ఇక కూలీలకు అదనంగా చెల్లించిన రూ.77,124 రికవరీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో హెచ్‌ఆర్ మేనేజర్ సుధకార్, పీఎం అశోక్, ఎంపీడీవో సోలమాన్‌రాజ్, ఎస్సార్పీ సురేందర్, ఏపీవో లక్ష్మయ్య, పీఏసీఎస్ చైర్మన్ రత్నకర్‌రావు, ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్, టీఏలు మంజుల, శారద, రవీందర్, హరిత, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించండి



మామడలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో రమేశ్

బాసర: పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీవో, పంచాయతీ ప్రత్యేకాధికారి బానోతు సుదర్శన్ పటేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. వారసంతకు వేలం పాట నిర్వహించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి గోవింద్ రాజును ఆదేశించారు. వారి వెంట ఎంపీవో గంగాసింగ్, బిల్‌కలెక్టర్ వంశీసాయి, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

మామడ: గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా పనులు చేపట్టాలని డీఎల్‌పీవో రమేశ్..పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. సీజనల్ వ్యాధులపై, దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాకాలంలో నీరు కలుషితమయ్యే అవకాశాలు ఉంటాయని తాగునీటిని క్లోరినేషన్ చేయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ అన్నపూర్ణ ఉన్నారు.

ఖానాపూర్: మండలంలోని సేవ్యానాయక్‌తండాలో మంగళవారం నిర్మల్ డీఎల్‌పీవో రమేశ్ పర్యటించారు. ఈసందర్భంగా గ్రామంలో పారిశుధ్య పనులు, పంచాయతీ రికార్డులు పరిశీలించారు. వర్షాకాలం నేపథ్యంలో ఫాగింగ్‌తోపాటు శానిటేషన్ పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో రత్నాకర్‌రావు తదితరులున్నారు.

కాలనీలను పరిశుభ్రంగా ఉంచుదాం

నిర్మల్‌టౌన్: దోమలు వ్యాప్తి చెంది.. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పట్టణంలోని కాలనీలను పరిశుభ్రంగా ఉంచుదామని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని దత్తాత్రేయ కాలనీలో పర్యటించారు. డ్రెయినేజీ, మురుగునీటి నాలాలు, ఇతర పలు సమస్యలను కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. వీధులు తిరుగుతూ డ్రెయినేజీ వ్యవస్థను పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా ఇంటి పరిసరాల్లో వర్షపునీరు నిలవకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వారి వెంట కాలనీవాసులు గంగారెడ్డి, వెంకటేశ్వరరావు, రవీందర్‌రెడ్డి, లింబాగౌడ్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

సీఎం ప్రసంగం వీక్షించిన రైతులు

సోన్: రైతునేస్తంలో భాగంగా మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని రైతులు వీక్షించారు. రెండో విడత రుణమాఫీపై రైతులను ఉద్దేశించి సీఎం మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈఓ రాథోడ్ అంబాజీ, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

బాసర: రైతునేస్తంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించగా మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులు వీక్షించారు. కాంగ్రెస్ నాయకులు రాజేశ్వర్ దేశాయ్, నానం విజయ్, అన్వర్, రాజు, మైనార్టీ, బ్యాంక్ సిబ్బంది, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఖానాపూర్: సీఎం ప్రసంగం వీక్షించేందుకు మండలంలోని సత్తన్‌పల్లి రైతువేదికకు పదుల సంఖ్యలో కూడా రైతులు హాజరు కాలేదు. కార్యక్రమంలో ఏఈవో రాకేశ్ తదితరులున్నారు.

నిధులు కేటాయించాలని వినతి

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ మండలం డ్యాంగాపూర్‌లో ఉన్న పెద్దమ్మతల్లి ఆలయానికి దేవాదాయ శాఖ నిధులు కేటాయించాలని ఆ గ్రామ ముదిరాజ్ సంఘం సభ్యులు మంగళవారం డీసీసీ అధ్యక్షుడు కుచాడి శ్రీహరిరావును తన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామాభివృద్ధికి సైతం సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ జిల్లా కోర్ కమిటీ సభ్యులు పాలకుర్తి ఉమామహేశ్వర్, జక్కం సంతోష్, అశోక్, సాయన్న, నారాయణ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

108 సిబ్బందికి సన్మానం

కుభీర్: ఉత్తమ సేవలకు గాను మండలంలోని పార్డి(బి) గ్రామానికి చెందిన 108 పైలట్ నస్రుల్లాఖాన్, టెక్నీషియన్ పండరికి ఇటీవల హైదరాబాద్‌లో లైఫ్ సేవియర్ అవార్డు ప్రదానం చేశారు. అందుకు అభినందిస్తూ మంగళవారం ముధోల్‌లోని రబీంద్ర స్కూల్‌లో నస్రుల్లాఖాన్‌ను సన్మానించారు. ప్రిన్సిపాల్ సాయినాథ్, కరస్పాండెంట్ రాజేందర్ ఉన్నారు.

తహసీల్దార్‌కు..

ముధోల్ : నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీకాంత్‌ను కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. పార్టీ మండల ఇన్‌చార్జి రావుల గంగారెడ్డి, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, కిషన్‌పటేల్, వాహజ్, దిగంబర్, అజిత్, ఖాలిద్‌పటేల్, నగేశ్, భోజేందర్, నిజమ్, షకీల్ పాల్గొన్నారు.

'మంత్రిపై వ్యాఖ్యలు సహించబోం'

లోకేశ్వరం: అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి సీతక్కపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని ముధోల్ తాలుకా ఎస్టీ విభాగం కన్వీనర్ సంగెం నర్సన్న హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట ఆదివాసీ నాయకులు ఉన్నారు.

సెంట్రల్ లైటింగ్‌కు మరమ్మతులు

ఖానాపూర్: పట్టణంలోని ప్రధాన రహదారి మధ్యలో ఉన్న సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు మంగళవారం మరమ్మతులు చేశారు. లైట్లు వెలగకపోవడంతో కొద్దిరోజులుగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. చైర్మన్ చిన్నం సత్యం, కమిషనర్ మనోహర్ క్రేన్ సాయంతో మరమ్మతులు చేయించారు.

మురుగుకాల్వ పరిశీలన



కాల్వ పరిశీలిస్తున్న ఈఈ శంకర్

కుభీర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోకి వరదనీళ్లు వస్తున్నాయని ఇటీవల పలువురు ఆసుపత్రి ఆవరణలో వరినాట్లు వేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం క్షేత్రస్థాయిలో మురికి కాల్వను పంచాయతీరాజ్ ఈఈ శంకర్ పరిశీలించారు. కొందరు వ్యాపారులు మురికి కాల్వపై అక్రమంగా షెడ్లు ఏర్పాటు చేసుకోవడంతో నీటి ప్రవాహం ముందుకెళ్లక నిలిచి ఉంటుంది. అక్రమషెడ్లు తొలగించాలని గ్రామ పంచాయతీ అధికారులను ఈఈ ఆదేశించారు. త్వరలో గ్రామసభ ఏర్పాటు చేసి తొలగించేలా చూస్తామని ఎంపీవో మోహన్‌సింగ్, ఈవో రాజేశ్వర్ తెలిపారు. వారి వెంట చందు, తౌఫిక్ తదితరులు ఉన్నారు.

పట్టణంలో అభివృద్ధి పనులు చేపడుతాం

- సర్వసభ్య సమావేశంలో ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ సత్యం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ సత్యం

ఖానాపూర్: పట్టణంలో ప్రజలు ఇబ్బంది పడకుండా ప్యాచ్‌వర్క్‌లు, అభివృద్ధి పనులు చేపడుతామని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నిర్మూలనకు చర్యలు చేపట్టడంతోపాటు ప్రజలకు తాగునీరు అందేలా చూస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సహకారంతో అవసరమైన చోట నూతన బోర్లు, మోటార్ పైప్‌లైన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలకు ఇబ్బంది కల్గకుండా రోడ్లపై పశువులు తిరగకుండా నియంత్రిస్తామని అన్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న బిల్ కలెక్టర్ భోజారాం, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. సమావేశంలో కౌన్సిలర్లు సంకీర్తన, విజయలక్ష్మి, స్రవంతి, లత, అఫ్రీన్, కిశోర్‌నాయక్, ఖలీల్, శ్రీనివాస్, షాజియా, కో–ఆప్షన్ సభ్యులు కిశోర్, కమిషనర్ మనోహర్ తదితరులున్నారు.

'అవ్వతాతలకు ఉత్తరం రాద్దాం రండి'



గోడప్రతులతో హెచ్‌ఎం విద్యాసాగర్, విద్యార్థులు

సోన్: మండలంలోని న్యూవెల్మల్ బొప్పారం జెడ్పీ పాఠశాలలో మంగళవారం 'అవ్వతాతలకు ఉత్తరం రాద్దాం రండి' గోడప్రతులను హెచ్‌ఎం విద్యాసాగర్, కార్యశాల కన్వీనర్, తెలుగు ఉపాధ్యాయుడు కొండూరి పోతన్నతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బాల సాహిత్య రజితోత్సవాన్ని పురస్కరించుకొని పత్తిపాక ఫౌండేషన్ సిరిసిల్ల, గరిపెల్లి ట్రస్ట్ భీమిని మల్లారెడ్డి పేట, సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పత్తిపాక మోహన్, మ్యాజిక్ చాప్లిన్ కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్తరాలు రాయడం మర్చిపోయిన ఈ కాలంలో ఇలాంటి కార్యక్రమాల నిర్వహణ ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మక, భాషా నైపుణ్యాలను వెలికితీస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మణ్, నీల రమేశ్, ముత్తన్న, లింగారెడ్డి, సంపూర్ణ, ప్రభాకుమారి, కవిత, కృప, భిక్షపతినాయక్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలని 1న ధర్నా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖానాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల వేళ ఇచ్చిన హామీలు అమలు చేయాలని వచ్చే నెల 1న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం ఆవరణలో ధర్నాకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే రేషన్‌కార్డులు, కొత్తపెన్షన్లు, పేదలకు ఇంటిస్థలాలు కేటాయించాలని కోరారు. ధరణి సమస్యలు పరిష్కరించి పోడు సాగుదారులకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఉద్యోగాల ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేయడంతోపాటు వ్యవసాయ కార్మికులకు రూ.12 వేల జీవనభృతి ఇవ్వాలని పేర్కొన్నారు. అంకుశ్‌రావు, రాజన్న, ఎల్లయ్య, శంకర్, రాజన్న, మధు, శ్రీనివాస్, తదితరులున్నారు.

'వరల్డ్‌విజన్' సేవలు అభినందనీయం



పోషకాహారం అందజేస్తున్న నాగమణి

లక్ష్మణచాంద: వరల్డ్ విజన్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని ఐసీడీఎస్ సీడీపీవో నాగమణి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వరల్డ్ విజన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మండలంలో పోషకాహార లోపంతో ఉన్న 24 మంది పిల్లలకు స్వచ్ఛంధ సంస్థ సమకూర్చిన పోషకాహార బుట్టలు అందజేశారు. రూ.వెయ్యి విలువ చేసే ఒక్కో బుట్టలో ఎనిమిది రకాల పోషకాలున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాధ, సఖీ కేంద్రం జిల్లా మేనేజర్ సవిత, సంస్థ కోఆర్డినేటర్ బ్రహ్మన్న తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలని వినతి



బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

సోన్: తమ రుణం మాఫీ కాలేదని.. సమస్య పరిష్కరించాలని మండల కేంద్రంతోపాటు గంజాల్ గ్రామ రైతులు మంగళవారం సోన్‌లో ఇండియన్ బ్యాంక్ మేనేజర్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తామన్నారు. రైతులు మాట్లాడుతూ రెండు విడతల్లో 700మంది రైతులకు గాను 200 మందికే రూ.లక్ష వరకు రుణం మాఫీ అయిందన్నారు. ఏఈఓ వద్ద, బ్యాంక్‌లో ఖాతాలను పరిశీలిస్తే నో డాటా వస్తుందని రైతులు పేర్కొన్నారు. తక్షణం అర్హులైన రైతులకు రుణమాఫీ చేయాలని కోరారు. కార్యక్రమంలో శానం గంగాధర్, లింగయ్య, పోశెట్టి, రావుల నారాయణ తదితరులు ఉన్నారు.

'ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి'

లోకేశ్వరం: రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చాలని ముదిరాజ్‌ల సంఘం సభ్యులు కోరారు. మంగళవారం తహసీల్దార్ మోతీరాంకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత కార్మికులు, గౌడ కులస్తుల మాదిరి మత్స్యకారులకు కూడా పింఛన్ సౌకర్యం కల్పించాలన్నారు. మత్స్యశాఖ అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని కోరారు. ముదిరాజ్ సంఘం సభ్యులు పాల గంగాధర్, నారాయణ, నవీన్, భోజన్న ఉన్నారు.

ఎంపీడీవో గారు.. సమయానికి రారు



11:30 గంటలకు ఖాళీగా ఎంపీడీవో కుర్చీ



మంగళవారం 11:53 గంటలకు కార్యాలయానికి వస్తున్న కడెం ఎంపీడీవో అరుణ

కడెం: మండలవాసులు ఏదైనా పని మీద ఎంపీడీవోను కలవాలంటే మధ్యాహ్నం 12 గంటల తర్వాతే కార్యాలయానికి వెళ్లాలి. ఎందుకంటే కడెం ఎంపీడీవో అరుణ ఆ టైంకే కార్యాలయానికి వస్తారు. ఏదో ఒక రోజు ఇలా అనుకుంటే పొరపాటే.. ఇదే నిత్యకృత్యం. దీంతో కార్యాలయ అధికారే సమయపాలన పాటించకపోవడంతో సిబ్బందిపై పర్యవేక్షణ లేకుండా పోయింది. మంగళవారం ఉదయం ఉడుంపూర్, ఇస్లాంపూర్ గ్రామాల ప్రజలు ఎంపీడీవోను కలిసేందుకు వచ్చి.. ఈరోజు మేడం రాదేమోనని నిరాశతో తిరిగి వెళ్లారు. ఈ విషయమై జెడ్పీ సీఈవో గోవింద్‌ను 'సాక్షి'వివరణ కోరగా సమయానికి వచ్చేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.